# "గన్ మ్యాన్"

'గన్ మ్యాన్' అనే తెగకు ఒక చిన్న కొమ్మువుంటుంది. దాన్ని రెండు చేతులతో పట్టుకోవాలని పైనుండి ఆదేశాలున్నాయి. కాని సర్వదా అలా పట్టుకొనే వుంటే చేతులు అలసిపోవా? అందుకే అప్పుడప్పుడు వాళ్ళు దాన్ని ఒక ఆభరణం లాగా -- శంకరుడికి ఉరగం, వైద్యుడికి స్టెతస్కోపు వున్నట్టుగా మెడలో ధరిస్తారు. అయ్యో! పాఠకులారా ఈ తెగను పరిహసించాలనే ఉద్దేశం లేదు. గన్ మ్యాన్ అంటే సాక్షాత్ గన్ మ్యానే. అంటే యాంత్రిక తుపాకి ధరించువాడు. అతను ఎల్లప్పుడు ఎంతో మెళకువగా వుండాలి. అందుకే అతన్ని ఒక హరిణంతో పోల్చినా ఏం తప్పులేదు. జింక గడ్డితింటున్నప్పుడు, లేక ఆకులు నెమరు వేస్తున్నప్పుడు లేక నీళ్ళ త్రాగుతున్నప్పుడు కూడా దాని అందమైన కళ్ళల్లో భయము, పరిసరాలను వీక్షించే జాగ్రతాభావం ఎల్లప్పుడు ప్రస్ఫుటమవుతూ వుంటుంది. గన్ మ్యాన్ అని చెప్పే ఈ కొత్తరకం పోలీసు వాళ్లకు కూడా అలాంటి కళ్ళు అవసరమే కాని, కళ్లను చూసి కాదుగదా నియమపాలకుల్ని ఎంపిక చేసేది?

పాత కాలం రోజుల్లో గన్ మ్యాన్ అనే తెగను చూడడానికి కూడా వీలుండేది కాదు. ముఖ్యమంత్రికి గాని, హోమ్ శాఖామాత్యులకు గాని గన్ మ్యాన్ వున్నా గూడా వాళ్ళ స్పెషల్ బ్రాంచి నుంచి వచ్చే వారు. వాళ్ళు మఫ్టీలో వుండేవారు. వాళ్ల చేతుల్లో వుండే ఆయుధం బయటకు కనిపించకుండా వుండాలని పాతరోజుల్లో ఆదేశాలు వుండేవి. ఈ కాలంలో గన్ మ్యాన్‌కు అలా ఏ వస్తువు గూడా దాచి వుంచాల్సిన అవసరం లేదు. అతనికి ఏదైనా 'నల్లపిల్లని'గాని 'భయంకరమైన' కుక్క అనిగాని ఏదైనా పేరిచ్చి ఒక ప్రత్యేకమైన వేషమిచ్చి దిగంబరులుగా నడిపించడమే ఈ కాలం విధానం.

పాత రోజుల్లో ప్రసిడెంట్ గాని, ప్రధాన మంత్రిగాని సందర్శనాలకు వచ్చేటప్పుడు ఎక్కువ పోలీసు వాళ్లు ఆ పరిసరాల్లో వుండకూడదనీ ఆదేశాలు వుండేవి. కాని ఈ రోజుల్లో ఏ వి.ఐ.పి. వచ్చినా రకరకాల ఆటోమ్యాటిక్ లేక సెమీ- ఆటోమ్యాటిక్ ఆయుధ విశేషాలు ధరించి ప్రత్యేక విభాగాల పోలీసు వాళ్లు మామూలు పోలీసు వాళ్ల సంఖ్యకంటే ఎక్కువగా కనిపించడమే కొత్త స్టైలు. బహువిధ విభాగాలకు చెందిన మప్టీ పోలీసులు వుండడం వల్ల అలాంటి వేషం ఏదైనా ధరించి ఒక ప్రత్యేక విభాగం భీకరులు కూడా వాళ్లతో కలిస్తే, దానికి ఎవరుకూడా అభ్యంతరం చెప్పక పోవచ్చు. కాని, ఈ ప్రత్యేక విభాగాల పోలీసు వాళ్లంతా కలర్ ఫోటోతో ఐడెంటిటీ కార్డు తమతమ కోటు జేబులపైన తగిలించుకొని వుంటారనే విషయం గమనించాల్సిందే. అందుకే 'భీకరులు' కూడా తమ తమ కలర్ ఫోటోలుగల ఐడెంటిటీ కార్డులు తగిలించుకొని వస్తే వాళ్లకు గూడా బందోబస్తులో కేంద్ర బిందువు వరకూ వెళ్లడం కష్టంగా వుండక పోవచ్చు.

గన్ మ్యాన్ విషయం వచ్చేప్పుడు, పోస్ట్‌మ్యాన్, పోలీసు మ్యాన్, వాచ్ మ్యాన్, స్పోర్ట్స్ మ్యాన్ అని చాలా పదాలు గుర్తుకు వస్తాయి. కాని ఇంగ్లీషులో వేరే ఏదో భాషనుంచి వచ్చిన ఒక పదము 'తాలిస్ మ్యాన్' దాని అర్థం ఏమిటి? తాళి అంటే అందరికి తెలుసు. అయితే తరచుగా తాళికట్టే అలవాటున్న ఒక మనిషే తాళీస్ మ్యాన్ అని చెబితే బుద్ధిలేని ఆ బ్రిటీష్‌వాళ్లు ఒప్పుకోరు. వాళ్లకు తాళికట్టే ఆచారమే లేదుకాబట్టి.

కడప జిల్లాలో ఒక గ్రామ సర్పంచ్ సుబ్బారాయుడు. అతని వయస్సు ముప్పైయారు. నల్లగా, లావుగా దాదాపు ఐదడుగుల ఎనిమిదంగుళాల ఎత్తున్న ఒక దున్నపోతు అతను. అతన్ని చూస్తే, ఎవరికైనా భయమేస్తుంది. అతని పేరు తెలియని వాళ్లు అతణ్ణి కర్కోటకుడు అని పిలవచ్చు. పెద్ద మీసాలున్నాయి. మూడు, నాల్గు రోజులనుండి క్షవరం జోలికిపోని గడ్డం మామూలుగా అతనికి వుంటుంది. అతని దృఢమైన కండరాలు చూస్తే, బాగా కసరత్తు చేసిన వాడిలాగా కనబడతాడు. అతని శరీరంలో అక్కడక్కడా కనబడే గాయాలు, మానిన మచ్చలు గమనిస్తే అతనేదో ఘోర ప్రమాదం నుండి ఎలాగో బయట పడినవాడిగా గాని, పానిపట్టు లేక మరాఠా యుద్ధాలలో సజీవంగా పాల్గొన్నవాడిగా గాని, లేక ఒక తాటకతో మూడున్నర రోజులు పడక గదిలో గడిపిన వాడిలాగా మామూలు వాళ్లకు అనిపిస్తుంది. కాని వాస్తవమేమిటి అని వెతికితే, ఆ వూర్లో కొంత కాలం నుండి జరుగుతున్న కొట్లాటల్లో, కత్తిపోట్లలో, అతను తన పాత్ర వహించాడని తెలుస్తుంది. రెండు మూడుసార్లు అతను శ్రీకృష్ణ జన్మస్థానం ఆతిథ్యం కూడా స్వీకరించి వున్నాడు. ఇలా బహువిధ యోగ్యతలు సంపాదించుకున్న ఒక వ్యక్తి సర్వదా ఆదరణీయుడు కావడంవల్ల, చాలామంది రాజకీయ

చాలామంది రాజకీయ నాయకులు అతణ్ణి తమకు దగ్గరగా చేర్చుకున్నారు. అలాగే తాము కూడా అతనికి ప్రీతి పాత్రులయ్యారు. ఈ విషయంగురించి మన వూరి చాణుక్యుడుగాని, ఇటలీ దేశపు మ్యాకివెల్లీగాని, ''ఛ -- ఛ ఆ రౌడీ వెధవతో ఎందుకు సంబంధం పెట్టుకున్నారు'' అని అడగకుండా, ''సెబాష్ అసలు రాజకీయం మీకే తెలుసు'' అని చెప్పితీరుతారు.

ఈ ముప్పైయారేళ్ల వాడి భార్య వయస్సు ఇరవైఎనిమిది. ఆమె పేరు సైరంధ్రి (పాఠకులు దయచేసి ఈపేరును దిద్దడానికి ప్రయత్నం చేయవద్దు) పురాణపాత్ర పేరు సైరంధ్రి అని నాకు కూడా తెలుసు. కాని ఇక్కడ మన హీరోయిన్ పేరు ఇలాగే వ్రాయక తప్పదు.) పులి రామయ్యకు, మేక సీతమ్మకు ఇద్దరు కొడుకులు పుట్టిన ఎంతో కాలం తర్వాత ఈ ఆడపిల్ల భూజాత అయింది. పులి రామయ్యకు ఒక కూతురు కలగాలని చాలా కోరికగా వుండేది. ముందు పుట్టిన ఇద్దరు సంతానాలలో ఒకరు ఆడది అయివుంటే మూడో సంతానం కొరకు అతను చెమట కార్చేవాడు కాదు. పెళ్లి అయిన రోజు నుండే, లక్ష్మిలాంటి ఒక కూతురు కలగాలని అతనికి పట్టుదలగా వుండేది -- అత్యాశా వుండేది. ఆ కారణంగా ఇద్దరు కొడుకుల తర్వాతకొన్ని సంవత్సరాల వరకు సీతమ్మ కడుపు ఉబ్బటం లేదని చూసి అతనికి నిరాశ మాత్రమే కాదు, కొద్దిగ కోపం కూడా రావడం జరిగింది. రెండో పెళ్ళి చేసుకుంటే ఎలా వుంటుందని ఆలోచన అప్పుడప్పుడూ ఆయనకు కలిగేది. ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మామూలు పనివాడైన పులి రామయ్యకు ఇద్దరు భార్యలతో కాపురం చేయడానికి కావల్సిన శారీరక బలం వుంది గాని, అంత సాంపత్తిక బలం వుండేది కాదు. అంటే అస్థి బలం వుందిగాని ఆస్తిబలం లేదన్నమాట. అతనికి లభించే మామూలు జీతం కాకుండా, ఇంటి దగ్గర నుండి, అప్పుడప్పుడూ లభిస్తున్న బియ్యం, కొంత డబ్బు వలన, క్లిష్టత లేకుండా ఆ చిన్న కుటుంబం రోజులు గడుపుతూ వచ్చింది. ఏమైనా, రెండో భార్య కావాలనే ఆలోచన, కొన్ని దుర్బల నిముషాలలో, అతనిలో అప్పుడప్పుడూ మెరుపులా వస్తూండేది. కాని అతనిలో ఆ దౌర్బల్యం పెరిగేముందు సీతమ్మ కడుపు సహకార భావంతో పెరగడం మొదలయ్యింది. ఈసారి పుట్టేది తప్పక లక్ష్మియనే అతను భావించాడు. దాని కొరకు చాలా దేవుళ్లకు మొక్కుకున్నాడు. ఈ కాలపు సినిమాలలో వచ్చే శ్రీలక్ష్మి, జయలక్ష్మి, విజయలక్ష్మి, జ్యోతిలక్ష్మి లాంటి లక్ష్మి కాదు ఆయనకు కావల్సింది. సాక్షాతు శ్రీలక్ష్మి లేక ఐశ్వర్యలక్ష్మి అనే ధనలక్ష్మి యొక్క ఒక చిన్న ప్రతిరూపం అతని మనసులో వుండేది. ఒక కూతురు పుడితే దానిని కష్టలక్ష్మి, నష్టలక్ష్మిగా అనుకుంటూ వస్తున్న ఈ కాలంలో, పులి రామయ్యకు ఇలాంటి ఒక కోరిక పుట్టడం మామూలు వాళ్లకు అర్థంకాని ఒక వింత విషయం.

ఫ్యాక్టరీ పరిసరాల్లో జీవనం సాగిస్తున్న పులి రామయ్యకు, చేతి గడియారం వుండేది కాదు. ఇంట్లో ఒక గోడ గడియారం వుండడం మాత్రం నిజం. అతని ప్రభాతం ఒక 'షాక్'తో ఉదయించేది. ఫ్యాక్టరీ సైరన్ వినడం వల్లనే. అప్పుడప్పుడూ అతను ఆలోచించేది -- తెల్లవారు ఝామున సైరన్‌కు సింహగర్జన గట్టితనము ఎలా వస్తుందని? ఫ్యాక్టరీలో వినబడే సైరన్లనను సరించే పులి రామయ్య తన దైనందిన కార్యక్రమాలకు రూప మిచ్చేవాడు.

తన ప్రియపుత్రిక భూజాత అయిన సమయంలోనే ఆఫ్యాక్టరీ సైరన్ మ్రోగటం గూడా సంభవించింది, అది ఎంతో శుభ సూచకమని పులిరామయ్య చాలా మందితో చెప్పటం జరిగింది. పెద్దగా చదువువంట పట్టని పులి రామయ్యకు, అతని మిత్రుల్లో ఒకడు తన పురాణ పాండిత్యాన్ని వెలగబెడుతూ, అదృష్టవంతురాలైన ఈ పాపకు ఒక సార్థక నామధేయాన్ని ఎన్నిక చేశాడు. ఆ పేరు -- ''సైరంధ్రి''. ఆ పేరువిన్న పులి రామయ్య పెద్దపులిలా నాట్యం చేయకుండా ఉండ లేకపోయాడు. మహా భారత కాలంలో గూడా సైరన్ ఉండేదనీ, అది మ్రోగేటప్పుడు పుట్టిన అడపిల్లలకు ''సైరంధ్రి'' అన్న పేరే పెట్టేవారనీ తెలుసుకొన్న పులి రామయ్యకు ఆనందంతో రోమాంచం కలిగినప్పుడు, అతని శరీరంలోని ఏ రోమమైనా విభీషణాయి తనంతో లేచి నిలబడకుండా ఉందో, లేదో అన్నవిషయం అతనికి తెలియదు.

సైరంధ్రిది మహర్జా తకమని ఎందరో తెలివిగల జోతిష్కులు తెలియజేశారు. సౌందర్యవతి, సుగుణవతి అయిన ఆమె ఒక మంత్రిగారికి భార్య అవుతుందని ఆజ్యోతిష్కుల్లో కొందరు ప్రవచించారు.

ఆ విషయం విన్న రామయ్యకు ఒక్కసారిగా గుండెదడ మొదలైంది. అతనికి ఎన్నో సందేహాలు పుట్టు కొచ్చినై. పాతకాలపు మంత్రులు చాలా మంది జైలుకు పోయివచ్చిన వారనీ, అట్లాంటి పాతజైలు చిరునామా లేని కొందరు మంత్రులు ఆ తర్వాత గూడా జైలుకు వెళ్ళటం జరిగిందనీ అతని కెవరెవరో చెప్పటం జరిగింది. ఈ విషయంవిని రామయ్య విలపిస్తున్న తరుణంలో, వేదాంత శిరోమణియైన ఒక జ్యోతిష్యరత్నం తన పరమజ్ఞాన సంపదనుండి అమూల్యమైన కొన్ని రత్నాలను, ముత్యాలను అతనికి ప్రసాదించాడు.

''రామయ్యా మేమంతా వివిధ రకాల బందీలమే గదా! అయోధ్యరాముడి తండ్రి దశరధుడు పుత్రశోకం అనే బందిఖానాలోనే కన్నుమూశాడు; రాముడు, సీత, లక్ష్మణుడు ఈ కాలంలో బహిరంగ బందిఖానాగా చెప్పబడే అరణ్యంలో పదునాలుగు సంవత్సరాలు గడపలేదా? ఇంకా సూక్ష్మంగా ఆలోచిస్తే శ్రీరాముడు ధర్మాచరణ అనే బందిఖానాలో

తన అవతార కాలమంతా ఎన్నో యాతనలు పడలేదా? అదీగాక తన ధర్మపత్ని సీతకు వివిధ రకాల కారాగార క్లేశాన్ని అనుభవించే స్థితిని కలుగజేయలేదా! జ్యేష్ఠ సోదరుని సేవ అనే కారాగారంలో లక్ష్మణుడు సంవత్సరాలు గడుపుతుండగా, ఊర్మిళ దీర్ఘకాల నిరంతర నిద్ర అనే కారాగారంలో తన యవ్వనంలోని ముప్పాతిక భాగాన్ని వృధా చేసుకోలేదా? మహాభారత కాలంలో పంచపాండవులు, కుంతీదేవి పాంచాలీ పంజరంలో ఎంతోకాలం మగ్గిపోలేదా? ధృతరాష్ట్ర మహారాజు, గాంధారీదేవీ అంధకార కారాగారంలో చనిపోయేవరకూ ఉండిపోలేదా? మనమంతా తల్లి గర్భంలో నవమాసాలూ ఏకాంత వాసంచేయలేదా? అదీ కొంతకాలం శీర్షాసనంలో... మనుషులు తీవ్రరోగ పీడితులైనప్పుడు ఆసుపత్రిలోగానీ, ఇంట్లోగానీ ఖైదీలుగానే ఉంటారు. అందుకే ఈ కారాగార వాసం గూర్చి ఆలోచించి నీవు కలత చెందకు. ఏమైనా మీ అమ్మాయికి మంత్రిపదవిలో ఉన్న భర్త లభిస్తాడనే గదా సూచన? అతను సరైన మంత్రీ కాకపోవచ్చు. మంత్రి హోదాగల ఒక కార్పొరేషన్ చైర్మన్ అయితే నీకు అభ్యంత రంలేదుకదా! ఏమైనా కారు, జెండా, పోలీసువాళ్ళ రక్షణ అన్నీఉన్న ఒక అల్లుడే నీకు లభిస్తాడు. అందువల్ల ఆనందంగా ఉండు. రాబోయే రోజులన్నీ నీకు ఐశ్వర్యాన్నే తెస్తాయి. అన్నీ ఆసర్వేశ్వరుడి మహిమా విలాసం.''

సైరంధ్రి చదువులో సమర్థురాలు. ఆ అమ్మాయి ఎనిమిదో తరగతి చదువుతుండగా, ఇద్దరు ముగ్గురు మతిలేని మన్మధులు ఆమెను వెంటాడు తుంటంవల్ల, ఈ విషయం తెల్సిన ఆమె పౌరుషంగల అన్నలు వారికి దేహశుద్ధి చేయటం జరిగింది. ఇటువంటి సమస్యలు ఇహముందు ఎదురుకాకుండా ఉండటానికి, ఇంట్లో ఎలుకను చంపటానికి ఇల్లే తగలబెట్టిన చందంగా, సైరంధ్రిని బడికి పంపటమే మానివేయించాడు రామయ్య.

తదనంతరం ఇల్లనే బందిఖానాలో గడపవల్సి వచ్చింది పాపం ఆ అమ్మాయికి. బయటకు పోవటానికే ఆమెకు అనుమతి లభించేదికాదు. ఏవేవో చదువుతూ, వ్రాస్తూ స్వేచ్ఛా తరుణం కోసం ఆమె ఎదురుచూసేది.

తలరాత చెరిపితే పోతుందా అన్న పలుకును సార్థకం చేయటానికన్నట్లేమో సంఘటన జరిగింది.

నాలుగు సంవత్సరాలుగా పురుషాక్షుల ప్రమాదంనుండి రక్షించబడిన ''సైరంధ్రి'' దేవాలయ ఉత్సవం రోజు సుబ్బారాయుడు కంటబడింది. మత్తుకలిగించే ఆమె విశాల నయనాలా? మయూర పింఛంలాటి ఆమెనీలి దీర్ఘకేశాలా, లేక మైమరిపించే ఆమె మందస్మితమా? ఇందులో ఏది అతణ్ణి ఆకట్టుకొన్నదో ప్రత్యేకించి చెప్పటం కష్టం. ఆమె ఏకైక పితృపాదులు, ఇరువురు జ్యేష్ఠ భ్రాతల సమక్షంలో కామప్రకోపంలో వళ్ళు

మర్చిపోయిన --- పరిసరాలను మర్చిపోయిన --- మానమర్యాదల్నే మర్చిపోయిన ఆ సుబ్బారాయుడు ఒక్కసారిగా ఆమె మణికట్టును గట్టిగా పట్టుకొన్నాడు. ఆ పట్టును వదిలించుకోవటానికి సైరంధ్రి ఎంతగానో ప్రయత్నించింది. ఆవేశంలో ఉగిపోయే పులి రామయ్య, అతని ఇద్దరు ప్రాయపు కుమారులు ఆ కామోన్నత్తుని ఉడుంపట్టునుండి సైరంధ్రిని విడిపించటానికి భగీరథ ప్రయత్నమే చేశారు. కానీ సుబ్బారాయుడి కుడి అరచేయి, ఆ అమ్మాయి కుడిచేయి మణికట్టుపై ఫెవికోల్‌తో అంటించినట్లు ---- సాక్షాత్తూ దేవాధిపతి ఐరావతం వచ్చిగుంజినా విడివడిరానట్లూ --- ఇరవై ఒక్కరోజులు తడి ఆరకుండా ధృడంచేసిన కాంక్రీట్‌లాగా --- పాత రోజుల్లో మకరం కరిరాజు కాలును కరచి పట్టుకొన్నట్లూ --- ఎంతో బలిష్టంగా, పటిష్టంగా అతుక్కుపోయి ఉంది. చెయ్యి పచ్చడి అయిపోయినంతగా ఆ అమ్మాయి బాధపడింది. ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. పులి రామయ్య, ఆయన తనయుల ప్రహారవర్షం సుబ్బారాయుణ్ణి ముంచివేస్తుండగా, తమ నాయకుణ్ణి రక్షించాలన్న ఆరాటంతో నలుగురైదుగురు యువకులు ఆవైపుగా పరుగెత్తుకు వచ్చారు. కానీ, అప్పటికే సుబ్బారాయుడు ఆ అమ్మాయి చేతి పట్టును వదిలివేశాడు. సుబ్బారాయుడు రెండడుగులు వెనక్కి వేసి, రివాల్వర్ తీసి పులి రామయ్యను, పులి పిల్లల్నీ ''మీరు ఇంకొక్క అడుగు ముందుకు వేసినా కాల్చిపారేస్తాను'' అంటూ హుంకరించాడు. ఇంకా అక్కడ ఉండటం సమంజసంకాదని పులి రామయ్య అతని సంతానం రంగంనుండి నిష్క్రమించారు. వెనుక నుంచి సుబ్బారాయుడు పగలబడి నవ్వుతూ ''మామా ఏనాటికైనా మీ అమ్మాయి నా సొంతమే, పట్టిన చెయ్యి విడవటం అనేది నా స్వభావమేకాదు'' అన్నాడు. మళ్ళీ ఒకసారి సుబ్బారాయుణ్ణి తన్నివద్దామని ఆ పులి బిడ్డలకు అన్పించింది కాని, తుపాకీతో ఆడుకోవటం పెద్దపులికిగానీ, చిన్నపులికిగానీ అంత శ్రేయస్కరం కాదని వాళ్ళకనిపించింది. అందువల్ల ఇంటివైపుగా ఫస్ట్‌గేర్‌లో నడిచిపోతున్న వాళ్ళ కాళ్ళు టాప్ గేర్‌కు చేరుకున్నాయి.

సుబ్బారాయుడు అనుకొన్నది సాధిస్తాడు. చెప్పేది చేసి చూపిస్తాడు. ఆ జిల్లాకు చెందిన ఒక మంత్రి ఒకనాడు పులి రామయ్యను పిలిచి, అతిథి మర్యాదలుచేసి ఈ విధంగా ఉపదేశించారు. ''మీ అమ్మాయిని శీఘ్రమే సుబ్బారాయుడికిచ్చి వివాహం జరిపించటం మీ కుటుంబానికి చాలా మంచిది. అంతమంచి యువకుడు, పౌరుషవంతుడు, శక్తిమంతుడు ఈ జిల్లాలో మరొకడు దొరకడు''.

నవనాడులూ కుంగిపోయిన పులి రామయ్య కలత చెందుతూ ''కానీ సార్ -- నా సైరంధ్రికి ఒక మంత్రి వరుడుగా లభిస్తాడని ఎందరో జ్యోతిష్కులు చెప్పారు సార్ --- అటువంటప్పుడు ఈ రౌడీ చేతిలో నా పిల్లనెలా పెట్టను?'' తక్షణమే ఏడవాలా, కొంచెం

సేదదీరి ఏడవాలా అన్న సందిగ్ధ స్థితిలో ఉండిపోయాడు పులి రామయ్య.

''పిచ్చి పులిరామయ్యా. నీకీ కాలం గూర్చి బొత్తిగా ఏమీ తెలియదు. ఈ సుబ్బారాయుడంటే ఎవరని అనుకొంటున్నావ్? అతను ఒక మంత్రికాదని నీ అభిప్రాయమా? అతని కేంతక్కువ? మంచి ఇల్లు లేదా? కారులేదా? పలుకుబడి లేదా? అతననుకొన్నది ప్రభుత్వంలో జరగదా? మందీ మార్బలం అతనికి లేదా? సరే అతని కారు మీద ప్రభుత్వ జెండా లేదే అనుకో --- కానీ, కావాలను కొంటే కారుకు పార్టీ జెండా తగిలించు కోవచ్చుకదా! అంతేకాదు, సుబ్బారాయుడు మంత్రి కావాలనుకొంటే కాలేడని నీకేమైనా సందేహముందా? అతనికి యేం అవసరం లేకపోయినా, అతని అవసరం మాకెంతో ఉంది. మంత్రులమైన మేము అసలు సిసలు ఖైదీలం. కానీ అతను స్వేచ్ఛా జీవి; ఎక్కడికైనా ఎప్పుడైనా పోగలడు, రాగలడు, ఈ పార్టీ గాక పోతే వేరే పార్టీలో జేరినా అతనికి కించిత్తు గూడా కష్టం వాటిల్లదు. ఒక్కమాటలో చెప్పాలంటే అతను మంత్రేకాదు, సాక్షాత్తూ మకుటంలేని మహారాజే.'' అంటూ ఉపదేశించి ఆవివాహానికి పులి రామయ్యను ఏదో విధంగా ఒప్పించగలిగాడు మంత్రి. ఈ వివాహ విషయంలో సైరంధ్రికి ఎటువంటి అభ్యంతరమూ లేదు. ఆ ''ముష్టి పట్టు''ను తలచుకొన్నప్పుడల్లా ఆమెకి పులకరింత గలిగేది.

సైరంధ్రి సుబ్బారాయుడుల వివాహం చాలా వైభవంగా జరిగింది. ఖర్చులో ఎక్కువభాగం సుబ్బారాయుడు వైపునుండే వచ్చింది. అయిదారుగురు మంత్రులు గూడా హాజరవటం ఆ పెళ్ళి ప్రత్యేకత.

పది సంవత్సరాల వైవాహిక జీవితంలో విచారించవలసిన పరిస్థితి సైరంధ్రికి ఎదురుకాలేదు. ఆదంపతులకు చాకుల్లాంటి ఇరువురు పుత్రులు కలిగారు. వివాహం తర్వాత ఎటువంటి గొడవల్లోనూ తలదూర్చలేదు సుబ్బారాయుడు, పైగా శాంతంగా వ్యవహరించటం గూడా అలవాటు చేసుకొన్నాడు, అయినా అతని నాయకత్వానికి మాత్రం ఏలోపం కలగలేదు. గ్రామసర్పంచి పదవికి అతనితో పోటీ పడేమగాడెవడూ ఆ పల్లెటూళ్ళో ఇంకా పుట్టలేదు.

మంత్రులు, ఎమ్మెల్యేలు 'గన్ మ్యాన్'' అనే అలంకారంతో తిరుగుతూ ఉంటే సుబ్బారాయుడికి ఏమీ వింతగా అన్పించలేదు. కానీ ఆ జిల్లాలోని కొంతమంది ఛోటా నాయకులకు కూడా గన్ మ్యాన్ కొత్తగా ఏర్పాటు కావటం చూసి తనకు కూడా అటువంటి ఏర్పాటు లభిస్తే బాగుంటుందన్న ఆలోచన కల్గింది. సుబ్బారాయుడికి. ఆలోచన కలగా లేగాని సుబ్బారాయుడు విషయంలో ఇంకా ఆటంకమేముంటుంది?

సుబ్బారాయుడుకు గన్ మ్యాన్‌గా శేషావతారమనే ఒక శేషావతారం నియమితుడైనాడు. తానొక హెడ్ కానిస్టేబుల్‌ననీ, తన చేతిలో ఒక ఆటోమేటిక్ ఆయుధం ఉన్నదనే అహంకారం సన్నటి అతని శరీరానికి తగినట్లుగా ఉండే ఎండిపోయిన ముఖంలో కొట్టవచ్చినట్లుగా కన్పించేది బయట తిరిగే టప్పుడు. శేషావతారాన్ని ఒక సేవకుడుగా. సుబ్బారాయుడు పరిగణించినా, ఇంటిలో మాత్రం ఒక వి.ఐ.పి గానే చూసేవాడు. పైకి తాను సన్నగా ఉన్నా తిండిదగ్గర మాత్రం తానొక వరాహావతారమే అన్నట్లుగా, సుబ్బారాయుడు ప్రతిదినం భుజించే పద్ధతి, అటు సైరంధ్రికి, సుబ్బారాయుడులకే గాక, ఇటు పిల్లలకు కూడా ఎంతో వినోదం కలిగించేది. ఏది పెట్టినా తింటాడు, ఎంత పెట్టినా ఇక చాలు అని చెప్పడు. తాడువంటి అతని శరీరంలో కొంచెం ఉబ్బుగా కన్పించేది ఒక్క ఉదరభాగమే. కొద్దిరోజులకే ఉదరం ఎక్కువైన ఉరగంలా కన్పించసాగాడు శేషావతారం. ఆ ఇంట్లో మరొక్క రెండేళ్ళు గనుక అతను ఉంటే, మేకనుగూడా సునాయాసంగా గుటుక్కు మనిపించే కొండచిలువలా మారిపోతాడేమో. తనతో సుబ్బారాయుడు ఎంత చనువుగా వ్యవరించినా తన స్టెన్ గన్‌ను మాత్రం ఒక్క సారిగూడా అతని కందించలేదు శేషావతారం. ఆ గన్‌ను ఎట్లా వాడాలో తెలుసుకోవాలన్న ఆరాటం సుబ్బారాయుడి కుండేది. ఆ గన్ గూర్చి సుబ్బారాయుడికి వివరించినా, మాగజైన్ బయటకు తీయకుండా మాత్రం ఎప్పుడూ ఇచ్చేవాడుకాదు శేషావతారం. ఆ ఆయుధంపై సుబ్బారాయుడికేర్పడ్డ జిజ్ఞాస రోజు రోజుకూ పెరగసాగింది. కానీ ఆ తిండిపోతు శాషావతారం ఏమాత్రం మెత్తపడలేదు.

సాయంత్రం వేళల్లో అయిదారు పెగ్గులు పట్టే అలవాటున్న సుబ్బారాయుడు, ఒకటి రెండు పెగ్గులు శేషావతారంకు గూడా ఇచ్చేవాడు. తాగిన సమయాల్లో లభించే వేయించిన కోడి, మేక మాంసాలమీదనే శేషావతారం దృష్టంతా ఉండేది.

ఒకరోజు సుబ్బారాయుడు త్రాగటం మొదలుపెట్టేసరికే రాత్రి పదిగంటలైంది. శేషావతారాని క్కూడా అధికంగా అందించాడు. ఆ రాత్రి భోజన సౌఖ్యానికిగూడా దూరమై స్పృహతప్పినట్లు నిద్రావస్థలోకి జారిపోయాడు శేషావతారం. తాను స్పృహకోల్పోలేదన్న విషయాన్ని రుజువు చేయటాని కన్నట్లుగా తుపాకీ పేల్చిన శబ్దంతో పోటీగా గురక పెట్టసాగాడు శేషావతారం. ఆ శబ్దమే సుబ్బారాయుడి దృష్టిని త్రాగే గ్లాసుమీదనుండి శేషావతారంవైపు మళ్ళించింది. ''వీడు నన్ను రక్షిస్తాడా? నేనే వీణ్ణి రక్షించాలా? అన్న సందేహం సుబ్బారాయుడిలో కలగటానికి తగిన కారణముంది. సంతోషపడుతున్నట్లుగా శేషావతారానికి కొంచెం ఎడంగాపడి ఉన్న స్టెన్ గన్ అనే తరుణి, ఇంతకాలానికి ఈ దరిద్రుడినుండి నాకు విడాకులు లభించాయన్న సంతోషంతో ఉన్నట్లుగా కన్పించింది

సుబ్బారాయుడికి, పెద్దగా అట్టహాసం చేయాలనే కుతూహలంతో ఉన్న ఆ తుపాకీ తరుణిని చేతుల్లోకి తీసికొని, గుండెకు హత్తుకొని, ముద్దుపెట్టు కోవటానికి ఇంకా వేచి ఉండటం తన వల్లకాదని భావించాడు సుబ్బారాయుడు.

ఆ గన్‌ను చేతుల్లోకి తీసుకొన్నాడు సుబ్బారాయుడు. ఎవరైనా చూసేరేమో అన్న శంక అతనిక్కల్గింది. అతని కళ్ళు ఆ అంధకారాన్ని చీల్చుకొంటూ నిశితంగా పరిశీలించి, ఎవరెవరో నల్లరంగు ముసుగులు వేసుకొని తనను తన చేతిలోని గన్‌ను రెప్పవేయకుండా చూస్తున్నట్లుగా అన్పించి భయంవేసింది.

కొంచెం తూలుతూ పడగ్గదికి చేరాడు సుబ్బారాయుడు. లైట్ స్విచ్ వేశాడు. ''ది అదర్ సైడ్ ఆఫ్ మిడ్‌నైట్'' ఏమిటో చదవలేని సైరంధ్రి అర్థ నగ్నావస్థలో ఆకర్షణీయంగా ఉండి అర్థరాత్రి అవతలి నిద్రాసుఖాన్ని అనుభవిస్తూ ఉంది ఆదరమరచి. బాగా మద్యం సేవించి ఉన్న సుబ్బారాయుడి దృష్టి ఇదేదీ పట్టించుకొనే స్థితిలో లేదు. అతనిధ్యాసంతా ఆ గన్ మీదే ఉంది. ''ఎంత గొప్పగా ఉందిది! చూడటానికే ఎంతో అందంగాఉంది. నా రివాల్వర్, డబుల్ బ్యారెల్ గన్ రెండూ ఈ స్టెన్ తరుణి కాలిగోటికి గూడా పనికిరావు. ప్రస్తుతం దీని శరీరాన్ని మొత్తం ఓమారు స్పర్శించి చూడాలి.

మంచంమీద కూర్చొని ఆగన్‌ను ఆప్యాయంగా నిమరసాగాడు. హఠాత్తుగా ఆగన్ ఒకసారి గర్జించింది. భయపడ్డ సుబ్బారాయుడు దానిని కిందకు పారేశాడు. కానీ, అదే సమయంలో --- సైరంధ్రి సైరన్ మ్రోగింది. సుబ్బారాయుడుకి ఏమీ అర్థంకాలేదు. పనిమనుషులందరూ పరుగెత్తుకొచ్చారు. జరిగిందేమిటంటే స్టెన్‌గన్ నుంచి వెళ్ళుకొచ్చిన మూడు తూటాల్లో రెండు సైరంధ్రికుడి తొడలోనుండి దూసుకుపోయాయి. కొళాయినుంచి నీరు జారినట్లుగా, రక్తంధారగా కారసాగింది. సుబ్బారాయుడు బాత్రూంలోకి పరుగెత్తుకెళ్ళి కొంచెం నీళ్ళు తలపై జల్లుకొని తిరిగి వచ్చాడు. ఇదేమీ తెలియని స్థితిలో గుఱ్ఱుపెట్టి నిద్రపోతున్న శేషావతారం తలపై గూడా ఒక బకెట్ నీళ్ళు కుమ్మరింపబడ్డాయి.తేరుకొన్న, కర్తవ్య నిరతుడైన ఆహెడ్ కానిస్టేబుల్ చటుక్కున వెళ్ళి తన ఆయుధాన్ని చేతిలోకి తీసికొన్నాడు.

ఏమాత్రం ఆలస్యంచేయకుండా సమీపంలో ఉన్న డాక్టర్‌వద్దకు సైరంధ్రిని తీసుకు వెళ్ళటం జరిగింది. ఆమె అక్కడ ఓ పదిహేను రోజులవరకూ ఉండిపోవలసి వచ్చింది. అదృష్టవశాత్తూ ఆ రెండుతూటాల్లో ఏ ఒక్కటి గూడా ఆమె ఎముకలకు తగల్లేదు.

ఆమర్నాడు శేషావతారం ఎస్పీగారి వద్దకు వెళ్ళి కన్నీళ్ళు పెట్టుకొంటూ జరిగిన విషయంలో సగం మాత్రమే చెప్పాడు.

శేషావతారం సస్పెండైనాడు. ఈ సంఘటనపై ఒక ఎన్‌క్వైరీ గూడా జరిగింది. కానీ సుబ్బారాయుడిపై ఎటువంటి కేసూ రిజిస్టర్ కాలేదు. తనకింకా గన్ మ్యాన్ అవసరం లేదంటూ సుబ్బారాయుడు ఎస్పీగారికి రాసిచ్చిన లేఖ ఇందుకు కారణం. ఆ లేఖలో ఈ రాజకీయ ప్రబుద్ధుడు ఒక ముఖ్యమైన సూచన చేయటంగూడా జరిగింది.

''లోగడ రోజుల్లో వలే ఒక్క మంత్రులకు మాత్రమే గన్ మ్యాన్‌ల నివ్వటంలో ఎటువంటి అనౌచిత్యం లేదు. ప్రజానాయకులుగా చెలామణి అవుతూ ఆ ప్రజలమధ్యకు పోవటానికి గన్ మ్యాన్ రక్షణ కోరుకొనే వీళ్ళు ఎటువంటి నాయకులు? తమ ప్రజల్ని వాళ్ళు శత్రువులుగా భావిస్తున్నారా? మిత్రులుగా భావిస్తున్నారా? తమ మనుష్యులనుండే రక్షణ కోరుతున్న ఈ నాయకుల పద్ధతి ప్రజాస్వామ్యానికే అవమానం ''అంటూ ఆ లేఖలో సుబ్బారాయుడు వివరించాడు.

కేవలం తనకు సంభవించిన అనుభవంతో ఇతర నాయకులందరికీ గన్ మ్యాన్‌లు అవసరంలేదంటూ సుబ్బారాయుడు సూచన చేయటం అతని సంకుచిత వైఖరిని వెల్లడిస్తున్నా, అతని అభిప్రాయం మాత్రం సర్వజన వాంఛితమే కదా!

- - -